www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 12 | ఫిబ్రవరి | 2026
పేజీలు : 8

## కంకీకొడవలి వైపే ఓటర్ల మొగ్గు



మెజారిటీ స్థానాల్లో సిపిఐదే గెలుపు
-ఎమ్మెల్యే కూనంనేని

2లో

# ప్రశాంతంగా పోలింగ్







**-ఖమ్మం జిల్లాలో 82.5 శాతం**
**-భద్రాద్రి కొత్తగూడెంలో 73.33 శాతం పోలింగ్**
**-చెదురుమదురు ఘటనలు మినహా అంతా ప్రశాంతం**

**ప్రజాపక్షం/ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం ఐదు గంటలకు ముగిశాయి. ఖమ్మంజిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు, కొత్తగూడెం కార్పోరేషన్‌లో ఎన్నికలు జరిగాయి. ఉదయం ఏడు గంటల నుంచి ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు వేశారు. ఖమ్మంజిల్లాలో అత్యధికంగా కల్లూరు మున్సిపాలిటీలో 86.97 శాతం పోలింగ్ నమోదు కాగా అతి తక్కువగా సత్తుపల్లి మున్సిపాలిటీలో 77.44 శాతం పోలింగ్ నమోదైంది. ఏదులాపురంలో 43, 811 మంది ఓటర్లకు గాను 37,391 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ 85.35 శాతం పోలింగ్ నమోదైంది. ఈ మున్సిపాలిటీ పరిధిలో 15వ వార్డు ఏకగ్రీవమైన విషయం విధితమే. వైరా మున్సిపాలిటీలో 20 వార్డులకు 24,689 మంది ఓటర్లకు గాను 20,639 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ 83.6 శాతం ఓటింగ్ నమోదైంది. సత్తుపల్లిలో 28,830 మంది ఓటర్లకు గాను 22,326 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ జిల్లాలోనే అతి స్వల్పంగా 77.44 శాతం పోలింగ్ నమోదైంది. కల్లూరులో అత్యధికంగా పోలింగ్ నమోదు కాగా ఇక్కడ పోలింగ్ శాతం 86.97 శాతంగా నమోదైంది. 18,866కు గాను 16,408 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధిరలో 22 వార్డులకు గాను సగటున 77.88 శాతం పోలింగ్ నమోదైంది. 25,679 మందికి గాను 20 వేల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం మిగతా 2లో..

## నేడు సార్వత్రిక సమ్మె

**-జయప్రదానికి కార్మిక సంఘాల పిలుపు**
**-వామపక్షాల సంపూర్ణ మద్దతు**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక రైతు సంఘాలు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి. గురువారం జరిగే సమ్మెకు అన్ని కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ రైతు సంఘాలు సహా సబ్బండ వర్గాలు మద్దతు ఇచ్చి గెలిపించాలని ఆయా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. గడిచిన రెండు మాసాలుగా సమ్మె జయప్రదం కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. సభలు, సమావేశాలు, పోస్టర్లు, కర పత్రాలతో సమ్మె ఆవశ్యకతను వివరించి ప్రజలను సమ్మెకు కార్యోన్ముఖులను చేశారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాల స్థానే తీసుకు వచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేబర్ కోడ్‌ల కారణంగా నాటి బ్రిటిష్ ప్రభుత్వం నుంచి ఇటీవల వరకు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దవుతున్నాయని కార్మిక సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. కనీస వేతనం, కార్మిక సంఘాల ఏర్పాటు, హక్కులకు రక్షణ లేకుండాపోతుందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. లేబర్ కోడ్‌ల అమలుపై వెనక్కి తగ్గినట్లే తగ్గినా ప్రభుత్వం తిరిగి అమలుకు పూనుకోవడం వెనక కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలు దాగి ఉన్నాయని ఆరోపణలు వినవస్తున్నాయి. ఇదే సమయంలో రైతు సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సమ్మె జయప్రదం కోరుతూ రైతు సంఘాలు విస్తృత ప్రచారం నిర్వహించాయి. మోడీ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని మోడీ చేసుకున్న వాణిజ్య ఒప్పందాల కారణంగా వ్యవసాయ రంగ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని మోడీ రైతాంగ వ్యతిరేక విధానాలకు మద్దతుగా సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పు చేసి పథకాన్ని సవరించి విబిజిరాంజీ ప్రవేశపెట్టడం ద్వారా గ్రామీణ ప్రాంత కూలీలకు ఉపాధి కరువవుతుందని వ్యవసాయ కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. వామపక్షాలు పోరాడి సాధించుకున్న పథకం రద్దు వెనక బిజెపి కుట్ర దాగి ఉందని ఆరోపిస్తున్నాయి. వీటన్నింటి మిగతా 2లో..

## పాల్వంచలో ఉద్రిక్తత

**-పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన సిపిఐ శ్రేణులు**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పాల్వంచలో బుధవారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పాల్వంచ సిఐ సతీష్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో సిపిఐ శ్రేణులు నిరసనకు దిగాయి. పోలీస్ స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన చేపట్టాయి. వివరాల్లోకి వెళితే... కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలోని పాల్వంచలో మిగతా 2లో..

## తటస్థతకే మొగ్గు చూపిన ఓటర్



**-కడవరకు పంపిణీ పనిలో అభ్యర్థులు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఓటు వేసేందుకు ఉత్సాహం చూపిన ఓటర్లు ఏ అభ్యర్థికి ఓటు వేస్తున్నామనే విషయంలో మాత్రం అత్యంత గుంబనంగా వ్యవహరించారు. చివరి వరకు తాము తటస్థులమేనన్న భావన కలిగించేలా వ్యవహరించారు. ఏ పార్టీకి ఓటు వేస్తున్నామో కూడా తెలియనంతగా ఓటర్లు మసులుకున్నారు. వివిధ పార్టీలలో నిరంతరం పని చేసే కార్యకర్తలు మినహా సామాన్య ఓటర్లు ఎవరు ఈ దఫా ఎన్నికల్లో, ప్రచార కార్యక్రమాల్లో మిగతా 2లో..

# ప్రశాంతంగా పోలింగ్





















(మొదటిపేజీ తరువాయి)

కార్పొరేషన్‌లో 74.19 శాతం పోలింగ్ నమోదైంది. 1,34,775 ఓట్లకు గాను 99,992 ఓట్లు నమోదయ్యాయి. ఇల్లందు మున్సిపాలిటీలో 24 వార్డులకు గాను 33,723 ఓట్లు ఉండగా 19,515 ఓట్లు నమోదయ్యాయి. 68.44 శాతం పోలింగ్‌తో కనిష్ట పోలింగ్ శాతం నమోదైంది. అశ్వారావుపేటలో 22 వార్డులకు గాను 16,854 ఓట్లు ఉండగా 12,839 ఓట్లు నమోదయ్యాయి. ఇక్కడ 76.20 శాతం పోలింగ్ నమోదైంది. ఎక్కడ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగలేదు. మధిరలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సత్తుపల్లిలో శాసనసభ్యురాలు మట్టా రాగమయి, కొత్తగూడెంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, ఏదులాపురం మున్సిపాలిటీలో సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, సత్తుపల్లిలో మాజీ ఎంఎల్‌ఎ సండ్ర వెంకటవీరయ్య ఓటు హక్కును వినియోగించుకున్నారు. వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### కొన్ని చోట్ల పోలీసుల అత్యుత్సాహం...

ఉమ్మడి ఖమ్మంజిల్లాలో కొన్ని పోలింగ్ బూత్‌ల వద్ద పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. కొత్తగూడెంలో 19వ పోలింగ్ బూత్ వద్దకు ఎర్ర చొక్కా వేసుకుని వచ్చారని ఓ పోలీస్ అధికారి చొక్కా విప్పించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో ఎంఎల్‌ఎ కూనంనేని జోక్యం చేసుకుని పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో కొన్ని పోలింగ్ బూత్‌ల వద్ద కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇతర ప్రాంతాల వారు ప్రచారం నిర్వహించినా పట్టించుకోని పోలీసులు సిపిఐకి సంబంధించిన స్థానికులు కనపడిన హడావుడి చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీలో జలగం నగర్‌లో పోలీసులు కాంగ్రెస్ పార్టీకి సహకరిస్తున్నారని బిఆర్‌ఎస్ కార్యకర్తలు ఆందోళన చేపట్టి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మధిర, కల్లూరు, సత్తుపల్లి, అశ్వారావుపేట, ఇల్లందు మున్సిపాలిటీల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మున్సిపాలిటీలో విలీనమైన రూరల్ ప్రాంతాల్లో ఓటింగ్ ఎక్కువగా జరిగింది. వైరా మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో ఒక బూత్‌లో 96 శాతం పోలింగ్ నమోదైంది. పట్టణ ఓటర్లు ఎప్పటి మాదిరిగానే ఓటు వేయడంలో కాస్త నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు.

# తటస్థతకే మొగ్గు చూపిన ఓటర్

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొనలేదు. అందుకే రాజకీయ పార్టీలు ఎక్కువగా కూలీలపై ఆధారపడ్డారు. ఇదే పరిస్థితి పోలింగ్ రోజు కూడా కనిపించింది. ఉదయం ఏడు గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటేసిన ఓటర్లు తమ అంతరంగాన్ని మాత్రం ఎక్కడ బహిర్గతం చేయలేదు. బరిలో నిలిచిన అభ్యర్థులు మాత్రం కడవరకు ప్రలోభాల పర్వాన్ని కొనసాగించారు. మూడు రోజులుగా దఫదఫాలుగా నగదు పంపిణీ చేసిన పార్టీల అభ్యర్థులు మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు పంపిణీ చేసే పనిలో ఉన్నారు. కొన్ని చోట్ల ఓటు ధర రూ. 5వేల నుంచి రూ.10వేల వరకు పలికింది. ఏజెన్సీ ప్రాంతమైన అశ్వారావుపేటలో ఓటర్లకు ఏడు వేల చొప్పున కొందరు అభ్యర్థులు పంపిణీ చేశారు. వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీలలో ఓటు ధర ఎక్కువగా పలికినట్లు సమాచారం. కొత్తగూడెం కార్పోరేషన్‌లో అధికార కాంగ్రెస్ విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేసింది. అదే పరిస్థితి ఏదులాపురం మున్సిపాలిటీలోనూ నెలకొంది. పోలింగ్ బూత్‌ల వద్దకు వచ్చిన తర్వాత కూడా కొందరు ఓటర్లకు నగదు పంపిణీ చేయడం గమనార్హం. కొందరు చీరెసారె, మద్యాన్ని పంపిణీ చేశారు. గతంలో కేవలం తటస్థ ఓటర్లకు మాత్రమే డబ్బులు పంపిణీ చేసేవారు. ఇప్పుడు బరిలో నిలిచిన అభ్యర్థులు మినహా మిగిలిన వారందరికీ నగదు పంచగా 99 శాతం మంది అన్ని పార్టీలు పంచిన నగదును, ఇతర నజరానాలను స్వీకరించారు. అందుకే ఒకరికి ఓటు వేసినట్లు బహిర్గతమైతే మరొకరికి తెలిస్తే ఇబ్బంది అవుతుందని ఓటర్లు గుంబనంగా వ్యవహరించారు. కుటుంబ సభ్యుల్లో సైతం ఒకరికి తెలియకుండా ఒకరు ఓట్లు వేసినట్లు కొందరు వ్యాఖ్యానించడం విశేషం. మొత్తానికి ఓటరు తీర్పు బ్యాలెట్ బాక్స్‌లో నిక్షిప్తమైంది. శుక్రవారం జరిగే లెక్కింపులో ఖమ్మం జిల్లాలోని 414 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 529 మంది భవితవ్యం తేలనుంది.

# నేడు సార్వత్రిక సమ్మె

(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలో ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెకు సబ్బండ వర్గాల మద్దతునివ్వనున్నాయి.

### సమ్మెకు సిపిఐ మద్దతు...

కార్మిక, రైతు సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంఘాలు, పార్టీ కార్యకర్తలు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ విజ్ఞప్తి చేశారు. మోడీ విధానాలు దేశ మనుగడకు ప్రమాదకరంగా మారాయని ఆయన తెలిపారు. మోడీ విధానాలను నిరసించకపోతే భవిష్యత్తులో దేశంలో ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడుతుందని సార్వత్రిక సమ్మెతో మోడీ విధానాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా సార్వత్రిక సమ్మెకు సిపిఎం, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ సహా వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతును ప్రకటించాయి.

# పాల్వంచలో ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)



ఓ మహిళనుదొంగ ఓటు ఆరోపణతో పోలీసులు స్టేషన్‌కు తరలించారు. గంటల తరబడి నిర్బంధించి ఆమెను వదలకపోవడంతో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా సమాచారం తెలుసుకుని అక్కడకు వెళ్లి మహిళను విడుదల చేయాలని కోరారు. ఆ సమయంలో సిఐ సతీష్ సాబీర్‌పాషా పట్ల దురుసుగా ప్రవర్తించారు. దీనితో సిపిఐ శ్రేణులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యాయి. స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు స్టేషన్ వద్దకు చేరుకుని పోలీసుల ప్రవర్తనను నిలదీశారు. అధికార పార్టీ చెబితే ఇష్టానుసారంగా వ్యవహరిస్తారా అని ఆయన ప్రశ్నించారు. సిపిఐ శ్రేణులతో పాటు కూనంనేని పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. పోలీసులు తమ వైఖరిని మార్చుకోవాలని అధికార పార్టీ చెప్పింది చేస్తూ ఇతర పార్టీలకు చెందిన వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తారా అని ఆయన నిలదీశారు. సిఐ క్షమాపణ చెప్పేంత వరకు ఆందోళన విరమించేది లేదని హెచ్చరించారు.

# కంకీకొడవలి వైపే ఓటర్ల మొగ్గు

ప్రజాపక్షం/కొత్తగూడెం : కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజాపక్షాన పోరాడుతున్న సిపిఐ అభ్యర్థుల విజయం ఖాయమని, 36కి పైగా డివిజన్లలో ఎర్రజెండా రెపరెపలాడబోతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం జరిగిన ఎన్నికల సరళిని ఆయన 60 డివిజన్ల వ్యాప్తంగా పర్యటించి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటర్లు ఎంతో చైతన్యవంతంగా పాల్గొన్నారని, సిపిఐ ఎన్నికల గుర్తు కంకికొడవలికి ప్రజల నుండి విశేషస్పందన లభించిందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఉత్సాహాన్ని చూపుతుంటే సిపిఐ అభ్యర్థుల మెజార్టీ స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

### అధికార పక్షాని బుద్ధి చెప్పిన ఓటర్లు...

ఎన్నికల సమయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొందరు ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ ఓటర్లను ప్రభావితం చేయాలని చూశారని కూనంనేని విమర్శించారు. అక్కడక్కడా పోలీసుల తీరు వల్ల చిన్నపాటి అసంతృప్తికర సంఘటనలు ఎదురైనప్పటికీ, ప్రజలు శాంతి యుతవాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకున్నారని అన్నారు. అధికార పక్ష ప్రలోబాలను కాదని ప్రజా సమస్యలపై నిలబడే సిపిఐకే ఓటర్లుపట్టం కట్టారని ఆయన విశ్లేషించారు.

### యంత్రాంగానికి అభినందనలు...

ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగాసాగేలా కృషి చేసిన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్‌పి రోహిత్ రాజ్‌కు కూనంనేని అభినందనలు తెలిపారు. రెండు రోజుల్లో జరగబోయే ఓట్ల లెక్కింపులో ప్రజల తీర్పు స్పష్టంగా వెల్లడవనుందని, కొత్తగూడెం అభివృద్ధిలో సిపిఐ కీలకపాత్ర పోషించబోతోందని ఆయన స్పష్టం చేశారు.

# బ్లూమింగ్ మైండ్స్‌లో ఫేర్‌వెల్ డే



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఫేర్‌వెల్ డే వేడుకల్లో అతిథిగా యుకె లండన్‌లో పారా లీగల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పూర్వ విద్యార్థిని శివాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా శివాణి మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ పి. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ చదువులో రాణించి పూర్వ విద్యార్థిని శివాణిలా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా శివాణిని సన్మానించారు. వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా 9, 10 తరగతుల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**-తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం**



**ప్రజాపక్షం/ఖమ్మం :** సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి చేసింది. మోడీ అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలతో దేశంలో వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోకి కూరుకుపోనుందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు తెలిపారు. బుధవారం సమ్మె జయప్రదం కోరుతూ వివిధ ప్రాంతాలలో రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ఇటీవల మోడీ ప్రభుత్వం చేసుకున్న వాణిజ్య ఒప్పందాలతో పలు విదేశీ వ్యవసాయ ఉత్పత్తులకు సుంకం లేకుండా దిగుమతి చేసుకోవడంతో భారతదేశంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఇప్పటికే వ్యవసాయ రంగంలో పెట్టుబడులకు ఉత్పత్తి ఆధారంగా వచ్చే ఆదాయానికి మధ్య తీవ్ర వ్యత్యాసం ఉందని పెట్టుబడులకు అనుగుణంగా గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. విదేశీ ఉత్పత్తులు దేశంలో సుంకం లేకుండా దిగుమతి చేసుకుంటే భారతదేశ వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ ఉండదని ఆయన స్పష్టం చేశారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించేందుకు మోడీ ప్రభుత్వం యత్నిస్తుందని సుదీర్ఘ పోరాట ఫలితంగా నల్ల చట్టాలను రద్దు చేసినట్లు నటించి తిరిగి దొడ్డిదారిన అమలుకు పూనుకుంటుందని గోవిందరావు ఆరోపించారు. సమ్మెతో మోడీ ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేలా రైతులు సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, నాయకులు పగడాల మల్లేష్, కూచిపూడి రవి, శాఖమూరి శ్రీనివాసరావు, రామకృష్ణ, రమేష్, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# నూతన విద్యా విధానం రద్దుకై ఉద్యమించాలి

**-దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఏఐఎస్‌ఎఫ్ సంపూర్ణ మద్దతు**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఏఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దుతు తెలియజేస్తుందని ఆయన తెలిపారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఇటికాల రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. విశ్వ విద్యాలయంలో, పరిశోధన సంస్థల్లో స్వయం ప్రతిపత్తిని తొలగించి విద్యార్థుల, ఉపాధ్యాయుల, అధ్యాపకుల ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘన కొనసాగిస్తుందన్నారు. బిజెపి నేతృత్వంలోని ఎన్డిఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ శిక్షా అభిష్టాన్ బిల్లు ను అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ బిల్లు సమాఖ్య నిర్మాణం, ప్రజాస్వామ్య స్వయం ప్రతిపత్తిని భారతదేశం ఉన్నత విద్య వ్యవస్థ యొక్క లౌకిక, శాస్త్రీయ స్వభావాలపై ప్రత్యక్ష దాడి చేస్తుందన్నారు. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ తో సహా ప్రస్తుతం ఉన్న రెగ్యులేటరీ ఆర్కిటెక్చర్‌ను రద్దు చేయాలని విబిఎస్ఏ బిల్లు ప్రతిపాదిస్తుందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై ఉద్యమించాలన్నారు. నేడు జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఏఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోహిత్, గోపి, లింగరాజు, దిలీప్, శ్రీను, ఉమామహేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నిక ప్రశాంతం

**-77.44 శాతం పోలింగ్ నమోదు**
**-ఓటుకు దూరంగా 6504 మంది**






**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సత్తుపల్లి మున్సిపాలిటీలో 77.44 శాతం పోలింగ్ నమోదయింది, మొత్తం 23 వార్డులకు గానూ 28,830 మంది ఓటర్లు కాగా అందులో 15,195 మంది మహిళలు, 13,620 మంది పురుషులు, ఇతరులు 15 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. అయితే ఇందులో 22,326 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. మిగతా వారంతా ఓటుకు దూరంగా ఉన్నారు.. దీనికి అనేక కారణాలు వినిపిస్తున్నాయి.. పోలింగ్ కేంద్రాలు నివాసాలకు దూరంగా ఉండటం ఒక కారణం కాగా ఓటు యొక్క ప్రాధాన్యతను వివరించడంలో అధికార యంత్రాంగం విఫలమైందని విశ్లేషకులు భావిస్తున్నారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు 66.41 శాతం మాత్రమే పోలింగ్ నమోదయింది. ఆ తర్వాత పోలింగ్ పూర్తి మందకొడిగా సాగింది. ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లకు పోలింగ్ కేంద్రాల వద్ద సరైన ఏర్పాట్లు లేవని పలువురు వాపోయారు. పోలీసుల హడావిడి తప్ప కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదని ఓటర్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉండటంతో ఓటింగ్ శాతం తగ్గినట్లుగా పలువురు భావిస్తున్నారు.

# అశ్వారావుపేటలో 76.2శాతం పోలింగ్



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మున్సిపాలిటీగా నూతనంగా ఏర్పడిన తర్వాత తొలిసారిగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 76.20శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అశ్వారావుపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో 16,500 ఓట్లు ఉండగా 12,839 ఓట్లు పోలయ్యాయి. 22 వార్డులకు గాను 35 పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సాంకేతిక సిబ్బందితో పాటు పోలీస్ బందోబస్తు నిర్వహించారు. చిన్న చిన్న సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అభ్యర్థులు రాజకీయ పార్టీల నాయకులు పోలింగ్ కేంద్రాల వద్ద వారి గుర్తులను ఓటర్లకు చెబుతూ ఆకర్షించుకున్నారు. ఏదిఏమైనప్పటికీ జరిగిన పోలింగ్‌లో పోటీ చేసిన అభ్యర్థులు తమకు వేశారు అంటే తమకు వేశారని మేమే గెలుస్తున్నామని ఆశాభావాన్ని వ్యక్తపరుస్తున్నారు. గత రెండు రోజులుగా ఓటర్లను ఆకట్టుకునే సందర్భంలో ఓటర్లకు నగదు పంపిణీ బహుమతులు ఏ మాత్ర పనిచేస్తాయని కౌంటింగ్ జరిగే వరకు వేచి చూడాల్సిందే.

## ప్రశాంతంగా మున్సిపల్ పోలింగ్

**పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సిపి సునీల్ దత్**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగాయి. ఎక్కడ ఎలాంటి అలజడి లేకుండా ఎన్నికల ఓటింగ్ కొనసాగింది. మున్సిపాల్ పరిధిలోని 20 వార్డుల్లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు వసతులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఖమ్మం జిల్లా సిపి సునీల్ దత్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఎన్నికల పరిస్థితిని ప్రజల స్పందన అడిగి తెలుసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఎన్నికలు నిర్వహించుకోవడం మనందరికి ఎంతో ఉపయోగకరమైందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. బుధవారం కమిషనర్ అభిషేక్ అగస్త్య పలు ప్రాంతాలలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. వెలుగుమట్ల పార్కు ప్రధాన రహదారి వెంబడి జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రహదారుల నిర్మాణం, డివైడర్ల సుందరీకరణ, మొక్కల పెంపకంపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో జరుగుతున్న సివిల్ పనులను పరిశీలించారు. ఆసుపత్రి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పనులు పూర్తి చేయాలన్నారు. ఖమ్మం నగరంలో కొనసాగుతున్న అన్ని పనులు నిర్ణీత సమయంలో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనుల్లో అలసత్వం వహించకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సిబ్బంది, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో రెజొనెన్స్ విద్యార్థుల ప్రతిభ




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ముంబాయిలో జరిగిన డబ్ల్యూఎఫ్ఎస్కెవో ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ విద్యార్థులు ఛాంపియన్ షిప్ ట్రోఫీని గెలుపొందారని పాఠశాల డైరెక్టర్ శ్రీధర్‌రావు తెలిపారు. ముంబాయిలో జరిగిన ఆసియా ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో అండర్ 14 కుమిటె బాలుర విభాగంలో ఎస్‌కె అద్నాన్ బంగారు పతాకం, కటా విభాగంలో సిల్వర్ పతాకం సాధించాడు. అండర్ 12 కుమిటె బాలికల విభాగంలో రెడ్డిబోయిన సోనాక్షి సిల్వర్ పతాకాన్ని కటా విభాగంలో బ్రౌంజ్ పతాకాన్ని సాధించారు. దుబాయ్‌లో ఏప్రిల్ 26న జరిగే ఇంటర్నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీలకు అర్హత సాధించినట్లు డైరెక్టర్ శ్రీధర్‌రావు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శనతో ఛాంపియన్ షిప్ ట్రోఫీ, అవార్డులు సాధించారన్నారు. పాఠశాలలో జరిగిన అభినందన సభలో డైరెక్టర్లు కె. శ్రీధర్‌రావు, కృష్ణవేణి లు పతాకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించి తమ పాఠశాలకు, జిల్లాకు మంచి గుర్తింపు తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పివిఆర్ మురళీమోహన్, కోచ్ ఎస్‌కె ఖాసీం, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిఐ అమలు తీరును పరిశీలించిన రాష్ట్ర కమిషనర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సమాచార హక్కు చట్టం ఆర్టిఐ అమలు తీరును రాష్ట్ర కమిషనర్ పివి శ్రీనివాసరావు పరిశీలించారు. బుధవారం ఖమ్మంలో ప్రభుత్వ కార్యాలయాలను రాష్ట్ర కమిషనర్ పివి శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నెస్పి క్యాంపులో ఉన్న సర్కిల్ 3 ఇరిగేషన్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్టిఐ రికార్డులను పరిశీలించారు. ఆర్టిఐ చట్టం ప్రకారం ఇరిగేషన్ కార్యాలయంలో 4(1)బి క్రింద 17 అంశాలతో కూడిన సిటిజన్ చార్ట్ ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులను సరిగ్గా నిర్వహించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్టివో కార్యాలయంలో సిటిజన్ చార్ట్ ఏర్పాటు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్టిఐ చట్టం ప్రకారం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించడంతో పాటు కార్యాలయాల్లో సిటిజన్ చార్ట్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆర్టిఐ కమిషనర్ తెలిపారు.

## వైరాలో 83.64% ఓటింగ్ పోలింగ్

**-20639 మంది ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలు**
**-స్ట్రాంగ్ రూమ్‌కి చేరిన బ్యాలెట్ బాక్సులు**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో జరిగిన ఎన్నికల్లో 20639 మంది ప్రజలు వారు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం మీద 83.64% ఓట్లు నమోదయ్యాయి. ఈ ఎన్నికల్లో 10866 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకోగా, 9773 మంది పురుషులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు మధ్య పోలీసులు బ్యాలెట్ బాక్సులను వైరాలోని పశుగణాభివృద్ధి కార్యాలయం వద్దకు చేర్చారు. ఎంతోఉత్కంఠ భరితంగా సాగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

## ఓటు హక్కు వినియోగించుకున్న సాబీర్ పాషా




ప్రజాపక్షం/కొత్తగూడెం : కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. 26వ డివిజన్ పరిధిలో ఓటు ఉన్న ఆయన సింగరేణి స్కూల్లో తన ఓటు వేశారు. సిపిఐ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ అన్ని పోలింగ్ బూత్‌లసమీపంలో పార్టీ శ్రేణులకు ధైర్యాన్ని నింపుతూ ముందుకు సాగారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పోరేషన్ వ్యాప్తంగా 36కి పైగా స్థానాల్లో సిపిఐ విజయం సాధిస్తుందని ఆశాభావాన్నివ్యక్తం చేశారు. రామవరం ఏరియాలోని పోలింగ్ బూతుల వద్ద పోలీసులు అతి ఉత్సాహాన్ని ప్రదర్శించడంతో ఆయన అసహనాన్ని వ్యక్తం చేశారు. అతేగాక ఒకానొక దశలో సిపిఐ,కాంగ్రెస్ కార్యకర్తల మధ్య పెద్ద ఎత్తున వాగ్వాదం చోటు చేసుకోవడంతోఅది తీవ్ర రూపాం దాల్చగా ఆయన తనదైన శైలిలో వ్యవహరించారు.

## యూరియాను యాప్‌తో బుక్ చేసుకోవాలి



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : తెలంగాణ ప్రభుత్వం రైతులకు యూరియా కొరతను నివారించడానికి దళారులకు ఎలాంటి అవకాశం లేకుండా నేరుగా యూరియా అవసరమైన రైతులు యాప్ ద్వారా ఆన్లైన్ చేసుకోవడం ద్వారా యూరియా అందించబడుతుందని మండల వ్యవసాయ అధికారి నా రెడ్డి సీతారామరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పిండిప్రోలు, దమ్మాయిగూడెం, బీరోలు, రాజారం, కాకరవాయి గ్రామాలలో యాప్ ద్వారా యూరియా పంపిణీ చేస్తున్న ఎరువుల దుకాణాలను సొసైటీ గోడములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు యూరియా అవసరం ఉన్న ప్రతి రైతు యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకుని కొనుగోలు చేయాలని అన్నారు. యాప్ ద్వారా రైతులు సులభంగా యూరియాను కొనుగోలు చేసుకోవచ్చని మొబైల్ ద్వారా యూరియాను బుక్ చేసుకోలేని రైతులు మండల వ్యవసాయ విస్తరణ అధికారులు చేస్తారని వారిని సంప్రదించాలని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా మండల వ్యాప్తంగా గోడం లలో ఎరువుల దుకాణాలలో ఎంత యూరియా కట్టలు స్టాక్ ఉన్నయో తెలుస్తాయని ఎక్కడ స్టాక్ ఉంటే అక్కడ బుక్ చేసుకోవచ్చని అని వివరించారు.

## ఉపాధి పనులపై గ్రామసభ



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : ఉపాధి హామీ పథకం క్రింద కొర్లబోడు తండా గ్రామంలో చేపట్టిన పనులకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. బుధవారం సర్పంచ్ భూక్యా చిన్నయ్య నాయక్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ సామాజిక తనిఖీకి సంబంధించి గ్రామంలో 2024 25 కాలంలో చేపట్టిన పనులకు సంబంధించి చర్చించారు. ఏపివో పద్మయ్య నాయుడు ఉపాధి హామీ పనులకు సంబంధించి గ్రామసభ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బానోత్ బీమ్లానాయక్, పంచాయతీ కార్యదర్శి రూపాదేవి, ఫీల్డ్ అసిస్టెంట్ కేలోత్ వెంకన్న, మేట్ భూక్యా కృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సారా కాచినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు



ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం పోలీస్‌ల ఆధ్వర్యంలో కౌలూరు, కలవల నాగారం మధ్యలో ప్రవహిస్తున్న పెద్ద వాగు సమీపంలో గుడుంబా తయారు చేస్తున్నారని సమాచారం మేరకు బుధవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో సారా తయారీకి ఉపయోగించే సుమారు 1000 లీటర్ల బెల్లం పాకం, నిల్వ ఉంచిన డ్రమ్ముల్ని పగలగొట్టి, సారా కాచేందుకు వాడే బిందెలు, గిన్నెలను కూడా ఆ ప్రాంతంలోనే పగలగొట్టారు. ఈ సందర్భంగా ఎస్సై పివిఎన్.రావు మాట్లాడుతూ ఎవరైనా కరకగూడెం మండలంలో సారా కాచినా, విక్రయించినా వారిపై చట్ట పరంగా తగు చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. కరకగూడెం మండలంలో ఎవరైనా సారా కాచినా అమ్మినా కరకగూడెం పోలీస్ 8712682102 8712682103 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

## పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ప్రజాపక్షం/పినపాక: మండల పరిధిలోని పాతరెడ్డిపాలెం గ్రామ పంచాయితీలో గ్రామమైన చింతలబయ్యారం గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామాన్ని శుభ్రంగా, పరిశుభ్రంగా ఉంచే దిశగా పరిశుభ్రత పనులను చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సొగబోయిన నాగ కుమారి మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ తమ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రతే ఆరోగ్యానికి మేలు చేస్తుందని, గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. అలాగే పాతరెడ్డిపాలెం గ్రామ పంచాయితీ పరిధిలో గ్రామాభివృద్ధికి సంబంధించిన అన్ని కార్యక్రమాలకు ఎప్పుడూ ప్రజలందరికీ సహకరిస్తానని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు, పంచాయితీ గుమస్తా పొనగంటి రామకృష్ణ, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలింగ్ సరళిని పరిశీలించిన అధికారులు




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సరళిని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎన్నికల పరిశీలకులు పవన్‌కుమార్ లు పరిశీలించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ మానిటరింగ్ సెల్ నుండి పోలింగ్ సరళిని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎన్నికల పరిశీలకులు పవన్‌కుమార్ లు పరిశీలించారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని వారు పరిశీలించి ఎప్పటికప్పుడు అధికారులకు తగు సూచనలు చేశారు.



**పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ :** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని జలగంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించారు. పోలింగ్ సరళిని, ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. ఓటింగ్ ప్రశాంతంగా జరిగేలా అధికారులు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

## యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఖాతాదారులకు అవగాహన సదస్సు

ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : ఖాతాదారులంతా బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంచుకుని ఆర్థిక క్రమశిక్షణతో సురక్షితమైన లావాదేవీలు నిర్వహించుకోవాలని జమలాపురం యూనియన్ బ్యాంక్ మేనేజర్ డి.వినోద్‌కుమార్ అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్బిఐ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారంలోభాగంగా బుధవారం జమలాపురం గ్రామంలో ఖాతాదారులకు ప్రజలకు ప్రత్యేక అవగాహన సదస్సు బ్యాంక్ సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలని, బ్యాంకులో రైతులు, మహిళా సంఘాలు, చిరు వ్యాపారులు, సీనియర్ సిటిజనులకు, విద్యార్థులకు అందిస్తున్న పలు రకాల సేవలను ఆయన వివరించారు. బ్యాంకింగ్ సేవల్లోని మార్పులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, తమ వ్యక్తిగత వివరాలను ఎవరికి తెలుపకూడదని సూచించారు. ప్రతిఒక్కరూ నగదు రహిత లావాదేవీలపై అవగాహన



కలిగి ఉండాలన్నారు. బ్యాంక్ లావాదేవీలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ కేవైసి వివరాలు ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది శరత్ చంద్ర, కె.ముకేష్, నాగార్జున, ఎల్ రవికుమార్, బాలకృష్ణ, వాసు, పల్లవి ఖాతాదారులు లక్కిరెడ్డి, నారాయణరెడ్డి, ఉయ్యూరు శ్రీనివాసరావు, బాజిరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్శిటి పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ గోపి బాధ్యతలు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : జిల్లా కేంద్రంలోని కాకతీయ యూనివర్శిటీ పీజీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ టి. గోపి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన రవికుమార్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలకు బదిలి కావడంతో ఆయన స్థానంలో కామర్స్ అండ్ బిజినెస్‌మెనేజ్‌మెంటు విభాగం అధ్యపకుడు డాక్టర్ టి.గోపిని నియమిస్తూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం గోపి



నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యపకులు, సిబ్బంది సహకారంతో కళాశాల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ యూనివర్శిటీకి ధీటుగా ఫలితాలు సాధించాలని అధ్యాపకులకు సూచించారు. తనను ప్రిన్సిపాల్‌గా ఎంపిక చేసిన విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్‌కు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## రేపటి నుండి హరే రామ నామ సంకీర్తన సప్తాహం

**-14 నుండి 17 వరకు శివ కళ్యాణోత్సవాలు**



ప్రజాపక్షం/కామేపల్లి: హరే రామ నామాన్ని సంకీర్తనల రూపంలో విశ్వ వ్యాప్తం చేసిన మహనీయుడు శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామి స్మృతి మందిరం 31వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 13వ తేదీ నుండి 20 తేదీ వరకు కామేపల్లిలోని మందిరంలో అఖండ హరే రామ నామ సంకీర్తన సప్తాహం నిర్వహిస్తున్నట్లు భక్త మండలి అధ్యక్షులు గొట్టుపర్తి శివాజీ తెలిపారు. ఈకార్యక్రమాన్ని కాళీ వన ఆశ్రమ పీఠాధిపతి శ్రీ యోగిని చంద్రకాళి ప్రసాద్ మాతజీ నామ సంకీర్తనను ప్రారంభిస్తారని తెలిపారు. అదే విధంగా 14వ తేదీ నుండి 17 వరకు శివ కళ్యాణ ఉత్సవాలు జరుగుతాయని దీనిలో భాగంగా 14న పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని, 15న మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం శివ కళ్యాణోత్సవాలు జరుగుతాయి, 16న రుద్రాభిషేకం రుద్ర హోమంతో పాటు అన్నదానం, 17న మంగళవారం అభిషేకం చండీ హోమంతో ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివుని కృపకు పాత్రులు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ప్రజాపక్షం/ములకలపల్లి: కేంద్రం కార్మికుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తుందని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నేడు ఉదయం 10గంటలకు కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఐటియుసి జిల్లా కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జాతీయ కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు నేడు ఉదయం 10గంటలకు ములకలపల్లి మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ కార్మికులు, అంగన్వాడి, ఆశ, ఏఎన్‌ఎం, మధ్యాహ్న భోజన కార్మికులు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు అందరూ హాజరై ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏఐటియుసి మండల కార్యదర్శి ఎస్‌కే బబ్బార్, గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు గద్దల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏదులాపురంలో ప్రశాంతంగా పోలింగ్







ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. 32వార్డుల్లో కాంగ్రెస్‌కు ఒక డివిజన్ ఏకగ్రీవం కాగా 31వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఉదయం 7గంటల నుండి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు తమ ఓటు హక్కును క్యూలైన్‌లోని నిలబడి వినియోగించుకున్నారు. సాయంత్ర 5గంటల లోపు 85.35శాతం ఓటింగ్ నమోదు కాగా37వేల391 మంది ఓటు వేశారు. ఇందులో పురుషులు 17వేల767, మహిళలు 19వేల622, ఇతరులు 2 ఓటు హక్కును వినియోగించుకున్నారు. జలగంనగర్ వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి పరిశీలించారు. అలాగే పలు పోలింగ్ కేంద్రాలను పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సందర్శించారు. 26వ డివిజన్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. 31వ డివిజన్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎటువంటి అవంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# ప్రశాంతంగా ముగిసిన మధిర మున్సిపల్ ఎన్నికలు

**78.27 శాతం పోలింగ్ నమోదు**





ప్రజాపక్షం/ మధిర : తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా బుధవారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మధిరలో జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మధిర మున్సిపాలిటీలో 22 వార్డులకు గాను 25,679మంది ఓటర్లు ఉండగా 20,100మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు, 78.27శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. 9వ వార్డులోని సుందరయ్య నగర్ పాత రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని, మధిర మున్సిపాలిటీ ప్రజలు కాంగ్రెస్ పార్టీకే పట్టం కడుతారని ధీమా వ్యక్తం




చేశారు. ఓటు హక్కు ఎంతో విలువైందని, ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగగా ఉదయం నుండే పోలింగ్ కేంద్రాల వద్ద అధికసంఖ్యలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. కొంతమంది యువతీ, యువకులు ఈ ఎన్నికల్లో తొలిసారిగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా వృద్ధులు కూడా పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధిర మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులకుగాను మొత్తం 44 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా మధిర టౌన్ సిఐ రమేష్, రూరల్ సిఐ మధు ఆధ్వర్యంలో పూర్తి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# పాల్వంచలో ప్రశాంతంగా పోలింగ్

**- బారులు తీరిన ఓటర్లు**
**- కోలాహలంగా పోలింగ్ కేంద్రాలు**



ప్రజాపక్షం/పాల్వంచ : కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ పాల్వంచ డివిజన్‌లోని 27 డివిజన్‌లో బుదవారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సుమారు మూడు దశాబ్దాల తరువాత మునిసిపల్ ఎన్నికలు జరుగుతుండటంతో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండే ఓటర్లు బారులు తీరారు. కొమ్ముగూడెం లోని 38, 45 డివిజన్‌లలో పోటీ పడుతున్న సిపిఐ, బిఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు గౌతమి క్రిష్ణ, నరేష్, రాజుగౌడ్, చెరుకూరి శేఖర్‌బాబు, చింతా నాగరాజులు రాజకీయాలు వేరు స్నేహం వేరు అంటూ స్పోర్టీవ్ నెస్‌ను ప్రదర్శించారు. ఒకరికొకరు సరదా గడుపుతూ ఓ సరికొత్త వాతావరణాన్ని సృష్టించారు. 6వ, డివిజన్‌లో అధికార పార్టీకి చెందిన కొందరు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. దీనితో కొంతసేపు గందరగోళానికి దారితీసింది. పాల్వంచ పాల్వంచ 46వ, డివిజన్ పోలింగ్ కేంద్రానికి ఓటు వేయటానికి వచ్చిన ఓ వ్యక్తిని ఓటేయాడానికి నిరాకరించారు. ఇది మినహా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్‌పి రోహిత్‌రాజు ఆదేశాలతో డిఎస్‌పి సతీష్ నేతృత్వంలో పాల్వంచ పట్టణంలో పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు.

## పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్‌పి

ప్రజాపక్షం/పాల్వంచ : కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ పరిధి పాల్వంచ 27 డివిజన్‌లోని పోలింగ్ కేంద్రాలను బుదవారం జిల్లా ఎస్‌పి బిరుదురాజు రోహిత్ రాజు పరిశీలించారు. ఉదయం ఏడు గంటల నుండి పోలింగ్ ప్రారంభమైనది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. పోలింగ్ ప్రక్రియ ముగిన తరువాత బ్యాలెట్ బాక్స్‌లను సురక్షితంగా కౌంటింగ్ కేంద్రాలకు చేర్చే వరకు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్‌పి వెంట డిఎస్‌పి సతీష్‌కుమార్, సిఐ సతీష్, ఎస్‌ఐలు నాగరాజు, కళ్యాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గర్భిణులకు పోషకాహారం అందించాలి



ప్రజాపక్షం/బూర్గంపాడు: గర్భిణులు తప్పకుండా పోషణతో కూడిన ఆహారం తీసుకోవాలని బూర్గంపాడు గ్రామ పంచాయితీ సర్పంచ్ మందా నాగరాజు అన్నారు. బుధవారం గ్రామ పంచాయితీలోని గౌతమిపురం అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్, ఐటిసి మిషన్ సునేత్రకల్ ఐజిటి సంస్థ ఆధ్వర్యంలో శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని, మాట్లాడుతూ ముందుగా గర్భిణీ స్త్రీలకు శుభాకాంక్షలు తెలిపారు. గర్భిణీగా ఉన్న సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను గుర్తు చేశారు. గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించడం సంతోషాన్ని కలగజేసిందని తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సక్కుబాయి, ఐటిసి సునేత్రకల్, ఐజిడి సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ స్వాతి, ప్రశాంతి అభిషేక్, అంగన్వాటీ టీచర్స్ జీవి రమణ, లలిత తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోషకాహారం అందించాలి



ప్రజాపక్షం/బూర్గంపాడు: విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని ఇరవెండి సర్పంచ్, ఉప సర్పంచ్ గుండి బాబురావు, మహంకాళి రామారావులు అన్నారు. బుధవారం ఇరవెండి ప్రాథమికోన్నత పాఠశాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, తరగతి గదుల పరిస్థితి, హాజరు రిజిస్టర్లు, పరిశుభ్రత వంటి అంశాలను వారు సమగ్రంగా పరిశీలించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ భోజనం నాణ్యతపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పిల్లలకు సమయానికి భోజనం వడ్డించాలని ఉపాధ్యాయులకు, వంట సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. అనంతరం ఉప సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, విద్య రెండూ సమానంగా ముఖ్యమైనవని, పాఠశాలలో భోజనం నాణ్యతపై ఎటువంటి రాజీ పడకూడదని అన్నారు. అవసరమైతే మెనే అమలుపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయితీ కార్యదర్శి గంగారపు స్పందన, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలి




ప్రజాపక్షం/కారేపల్లి: ఫిబ్రవరి 12 దేశ వ్యాప్తంగా జరుగు సార్వత్రిక సమ్మెలో మా దారం సీల్ట్ ప్లాంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలి టియుసిఐ కారేపల్లి కామేపల్లి ఏరియా కార్యదర్శి ధరావత్ సక్రు పిలుపునిచ్చారు. బుధవారం సమ్మె జయప్రదం కోసం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసిన, కేంద్రం ప్రభుత్వం 4 లేబర్ కోడ్లు 6 సంవత్సరాల క్రితం మార్చిందన్నారు. దేశ వ్యాప్తంగా కార్మిక వర్గ ప్రతిఘటన ఫలితంగా నేటి వరకు అమలు చేయలేదన్నారు. నరేంద్ర మోదీ అవలంభిస్తున్న కార్పొరేట్ కంపెనీల అనుకూల విధానాలను కార్మిక వ్యతిరేక విధానాలను, పని గంటల పెంపుదలకు వ్యతిరేకంగా 12 నాటి దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ నాయకులు శ్యామ్, ఈరన్న, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

## సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు




ప్రజాపక్షం/మణుగూరు: ఈ నెల 12 వ తేదీన దేశ వ్యాప్తంగా జరుగు బంద్ కు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు లు తెలిపారు. దేశ వ్యాప్తంగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మారుస్తూ కేంద్ర ప్రభుత్వం 44 చట్టాలను 4 చట్టాలు బార్కొడులుగా మార్చిందని, దీని వలన కార్మికులకు భద్రత కరువవుతుందని, కార్మికుల హక్కులు కాలరాస్తున్న ఈ చట్టాలను వెంటనే రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా రేపు 12 న కార్మిక సంఘాల బంధు కు సిపిఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని, రేపు జరుగు బందులో కార్మికులు పార్టీ ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరుచున్నామని పిలుపునిచ్చారు. గురువారం ఉదయం 9.30 గంటలకు మణుగూరు తహాశీల్దారు కార్యాలయం కు చేరుకోగలరనివారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గద్దం వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్షులు రాయల బిక్షం, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, బోశెట్టి సంపత్ లు పాల్గొన్నారు.

# కల్లూరులో పోలింగ్ ప్రశాంతం

**ప్రజాపక్షం/కల్లూరుః** ప్రశాంతంగా పోలింగ్ కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు కమీషనర్ రామ దుర్గారెడ్డి తెలిపారు. పోలింగ్ 87.08 శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మొత్తం 18,866 కాగా 16,428 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. పోలింగ్ లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. 20 వార్డులకు గాను 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 256 మంది ఆరువోలు ఏడుగురు, 49 మంది పిఒలు, ఏపీవోలు 49 మంది, పోలీస్ సిబ్బంది 150 మంది పాల్గొన్నట్లు కమీషనర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని పోలీసులు తెలిపారు. ఎన్నికల కేంద్రాలను కలెక్టర్ అనుదీప్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఏసిపి వసుంధర యాదవ్ తదితరులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ రోజున కూడా సుక్కా ముక్కా, నగదు విచ్చలవిడిగా పంపిణీ చేసినట్లు ఓటర్లలో చర్చలు కొన



సాగాయి. మొదటిసారిగా జరిగిన పురపాలక ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో పోలింగ్ కు సహకరించిన అధికారులకు ఓటర్లకు ప్రజలందరికీ ప్రత్యేకమైన ధన్యవాదములు కమిషనర్ రామ దుర్గారెడ్డి, ఎస్ఐ హరిత ఓటర్లకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# సమ్మెతో కార్మిక ఐక్యత సత్తా చాటాలి




**ప్రజాపక్షం/భద్రాచలం :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక,కర్షక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, సత్తాచాటేందుకు నేడు జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రథం చేయాలని అఖిలపక్షాల నాయకులు అన్నారు. ఈ మేరకు స్థానిక సిపిఐ కార్యాలయంలో

**- అఖిలపక్ష సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు**

జరిగిన సమావేశంలో నేతలు మాట్లాడారు. ప్రాణాలు అర్పించి సాధించుకున్న హక్కులను పాలకులు కాలరాస్తున్నారని , మోడి సర్కార్‌కు బుద్ధి రావాలంటే అన్ని కార్మిక సంఘాలు ఒక్కతాటిపైకి వచ్చి ఉద్యమించాలన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయం నుండి ఉ.9 గం. నుండి కార్మిక ప్రజా ప్రదర్శన ప్రారంభం అవుతుందని, ఈ మహాప్రదర్శనలో పెద్ద ఎత్తున కార్మికులు,కర్షకులు అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని అన్నారు. ఈ రౌండ్ టేండ్ సమావేశంలో సిఐటియూ నాయకులు ఎంబి నర్సారెడ్డి, నకిరికంటి నాగరాజు, వైవి రామారావు, రమేష్, రత్నం,ఏఐటియూసి నాయకులు సాదనపల్లి సతీష్, ఏడుకొండలు, ప్రజాపంద మాస్ లైన్ నాయకులు కచ్చెల కల్పన, మునిగెల శివప్రసాద్, బిఆర్ఎస్ కార్మిక విభాగం నాయకులు ప్రేమ్ కుమార్, ఐఎన్‌టియుసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సుజాతనగర్‌లో ఎన్నికలు ప్రశాంతం

**ప్రజాపక్షం/సుజాతనగర్‌:** సుజాతనగర్ ప్రాంతంలోని నాలుగు డివిజన్లకు జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుండి ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5:00 లకు ముగిసింది మొత్తం నాలుగో వార్డులకు గాను 15 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీరు, టెంట్, వైద్య సదుపాయాలు, వృద్ధుల కోసం వీల్ చైర్ ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు అధికారులు చేశారు. తొలిసారి సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలలో జరుగుతున్న కార్పొరేషన్ ఎన్నికలకు ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీగా పోటీ జరిగింది. ఎన్నికల రెండు రోజులు ముందు నుంచి ఓటుకు 2000 రూపాయలు, చీరలు, మద్యం, భోజనాలు, బిర్యానీ ప్యాకెట్లు ఓటర్లకు ఇచ్చి ప్రలోభాలకు గురి చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓటర్లు మాత్రం తెలివిగా ఏ నాయకుడు వచ్చినా తమ ఓటు మీకే అంటూ అభ్యర్థులకు తెలియజేశారు. కొన్నిచోట్ల డబ్బులు అందలేదని ఓటర్లు కొంతమంది అభ్యర్థులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. ప్రధానంగా సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీల మధ్య ప్రచారాలు హుటాపొటిగా జరిగాయి. కొంతమంది స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉండి గెలుపు కోసం ప్రయత్నాలు చేశారు. ఓటర్ల నాడి తెలియక ఏ అభ్యర్థి గెలుస్తారని తీవ్ర ఉత్కంఠ



భరితంగా మారింది. ఈ నెల 13వ తేదీన ఎన్నికల కౌంటింగ్ కోసం అంతా ఎదురుచూస్తున్నారు. కొంతమంది తమ పార్టీలు గెలుస్తాయని లక్షల్లో బెట్టింగ్‌లు పెట్టినట్లుగా సమాచారం. ఉదయం నుండి ప్రారంభమైన పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు చేశారు. పోలింగ్ సరళని కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ, సిఐ రాయల వెంకటేశ్వర్లు పరిశీలించారు, సుజాతనగర్ ఎస్ఐ యం. రమాదేవి ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించారు.

# అట్టహాసంగా ప్రారంభమైన డిఏఈ స్పోర్ట్స్






**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండల కేంద్రంలోని గౌతమీనగర్‌లో బుధవారం డిపార్ట్మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ స్పోర్ట్సస్ అండ్ కల్చరల్ మీట్ అథ్లెటిక్స్ పోటీలను డీసీఎస్ మహాపాత్ర ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కాలనీలోని అటామిక్ ఎనర్జీ సెంట్రల్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు దేశంలోని డీఏఈ పరిధిలో ఉన్న అన్ని కర్మాగారాల నుండి క్రీడాకారులు హాజరు అవుతున్నారు. భారజల కర్మాగారం యాజమాన్యం ఈ క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇస్తుండటంతో హెవీ వాటర్ ప్లాంట్ జిఎం జి శ్రీనివాస్ క్రీడా పోటీలకు, క్రీడాకారులకు కావలసిన సౌకర్యాలను ఏర్పాట్లను స్వయంగా ఏర్పాటు చేస్తూ పర్యవేక్షిస్తున్నారు. 11వ తేదీ ఉదయం 9గంటలకు ఉత్సాహకరమైన వాతావరణంలో వైభవంగా ప్రారంభమైన ఈ క్రీడా పోటీలు 13వ తారీకు సాయంత్రం నాలుగు గంటలకు ముగియనున్నాయి. ఈ కార్యక్రమంలో డీజీఎం జగన్నాధ శర్మ, మోహన్ కుమార్, రఫీ క్యూ అహ్మద్, సీఏఓ లత, ఏడిఎంఓ కృష్ణ కాంత్, స్పోర్ట్స్ కన్వీనర్ ప్రదీప్ మన్యం, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన సిపిఐ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ఎన్నికల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థులకు ఓట్లు వేసిన ఓటర్లకు సిపిఐ జిల్లా సమితి కృతజ్ఞతలు తెలిపింది. బుధవారం సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యర్థులు ఎన్ని ప్రలోభాలకు గురి చేసిన ఓటర్లు కమ్యూనిస్టు పార్టీవైపు మొగ్గుచూపి సిపిఐ అభ్యర్థులకు అండగా నిలిచారని సురేష్ తెలిపారు. భవిష్యత్తులో సైతం ఇదేవిధంగా కమ్యూనిస్టు పార్టీకి సంపూర్ణ మద్దతు నివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పోలింగ్ కేంద్రాలు.. బందోబస్తును పరిశీలించిన సిపి

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లాలోని ఐదు మున్సిపాల్టీలలో బుధవారం జరిగిన ఎన్నికల సరళిని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ పరిశీలించారు. ఏదులాపురం, కల్లూరు, సత్తుపల్లి, వైరా, మధిరలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లును పరిశీలించి విధుల్లో ఉన్న సిబ్బంది, పోలీసు అధికారులకు దిశానిర్ధేశం చేశారు. అడిషనల్ డిసిపిలు ప్రసాద్‌రావు, రామానుజం, కల్లూరు ఏసిపి వసుంధరయాదవ్‌తో చర్చించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు పటిష్టమైన శ్రద్రత ఏర్పాటు చేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా తగుచర్యలు తీసుకోవాలని వారికి సూచించారు.



## విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** మండల పరిధిలోని పంగిడి గ్రామంలో అంగన్‌వాడీ విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా స్వాతి, ఉప సర్పంచ్ బోడా రాజా చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఉచితంగా యూనిఫాం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు భూక్యా హరిసింగ్, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్ బుధవారం జరిగిన కార్పోరేషన్ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. 48వ డివిజన్‌లోని జగ్గు తండా ఎంపిపిఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యవ్యవస్థలో ప్రతి పౌరుడికి లభించిన అత్యంత విలువైన హక్కు ఓటు హక్క అని తెలిపారు. ప్రజాస్వామ్యలో మనగళాన్ని వినిపించడానికి ఓటుహక్కు శక్తి వంతమైన సాధనం అని అన్నారు.



## పంచాయితీ భవన నిర్మాణానికి భూ విరాళం

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అమ్మగారి గ్రామ పంచాయితీలో బుధవారం గ్రామ సర్పంచ్ ఇర్ప కవిత అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మన గ్రామం మనమే అభివృద్ధి చేసుకోవాలని ఉత్తమ గ్రామ పంచాయితీగా తీర్చిదిద్దుకునే విధంగా పాలకవర్గానికి ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం గ్రామ పంచాయితీ భవనం నిర్మాణానికి 3గుంటల భూమిని విరాళంగా ఏలూరి శ్రీనివాసరావు ఇచ్చారని, వారికీ గ్రామ ప్రజలు, పాలకవర్గం తరపున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జామ ఖాదర్, వార్డు మెంబర్లు, మాజీ సర్పంచ్ పాయం భద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ నేలపట్ల సుధాకర్‌రెడ్డి, జామ శ్రీను, ఎస్‌కే అబ్జల్, తదితరులు పాల్గొన్నారు.



## పిటిఎం సమావేశాలకు హాజరు కావాలి

**ప్రజాపక్షం/ములకలపల్లి:** ప్రతి ఒక్క తల్లిదండ్రులు వారి పిల్లల కోసం నెలలో ఒకరోజు రోజుల్లో ఒక గంట కేటాయించి వారి ఎదుగుదలకు తోడ్పడాలని ములకలపల్లి సర్పంచ్ కొర్సా చంద్రలేఖ అన్నారు. బాలల హక్కుల సంరక్షణపై బుధవారం ములకలపల్లి గుడ్ పెప్పర్డ్ స్వచ్చంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలల హక్కుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని అన్నారు. గ్రామాల్లోని ప్రతి ఒక్క చిన్నారులు పాఠశాలలకు వెళ్లేలా చూడాలన్నారు. బాలల హక్కుల సంరక్షణ కోసం గుడ్ పెప్పర్డ్ స్వచ్చంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. పిల్లల నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు శిక్షణ తరగతులు నిర్వహించడం వారి హక్కులను కాపాడేందుకు కృషి చేస్తున్నందున సిస్టర్స్‌ను అభినందించారు. ఈ సమావేశంలో పంచాయితీ కార్యదర్శి రవి, వార్డు సభ్యులు పిల్లల తల్లిదండ్రులు, గుడిసెపాడు సిస్టర్స్ ఉదయ దీప్తి, రాజ్యం, సిబ్బంది సాగర్, సుజాత, బాలరాజు, నాగరాజు, సందీప్, తదితరులు పాల్గొన్నారు.



# అడ్డంకులుగా మారిన ఆక్రమణలు..!

-దర్జాగా రోడ్లు, సైడ్ డ్రైన్లపైన గదుల నిర్మాణాలు
-ఆక్రమణలు కనిపిస్తున్నా పట్టించుకోని అధికారులు







**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల కేంద్రంలో ఇటీవల రహదారులు, సైడ్ డ్రయిన్ల ఆక్రమణల విషయం స్థానిక ప్రజల్లో పెద్ద చర్చినీయాంశంగా మారింది. రద్దీగా ఉండే కూడళ్ళలో మూల మలుపుల వద్ద రోడ్లు ఇరుకుగా మారడం ఇందుకు ప్రధాన కారణం. మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా, జూలూరుపాడు గ్రామంలోకి వెళ్లే రావి చెట్టు బజార్ కూడలి, పాపకొల్లు క్రాస్ రోడ్ కూడళ్లలో రాకపోకల సమస్య జటిలంగా మారింది. కొందరు సైడ్ డ్రైన్లను ఆక్రమించడం, వాటిపైన చిన్న చిన్న గదులను నిర్మించి అందులో చిరు వ్యాపారాలను ప్రారంభిస్తున్నారు. ఇటువంటి ఆక్రమణ స్థలాల్లో నిర్మించిన గదులను అద్దెలకు కూడా ఇస్తున్నారు మరికొందరు. సైడ్ డ్రైన్లపై గదులు నిర్మాణం జరపడంతో చివరకు వ్యాపారం రోడ్డుపైనే కొన సాగుతుంది. మరి కొంతమంది జనావాసాల ముందున్న సైడ్ డ్రైన్లను కూడా ఆక్రమించుకున్నారు. ఒకరిని చూసి మరొకరు ఈ విధంగా ఆక్రమణ పర్వం సాగించడంతో రోడ్లు మూసుకు పోతున్నాయి. కొన్నేళ్లుగా సాగుతున్న ఈ రహదారుల ఆక్రమణ పర్వం కళ్ళ ముందు కనిపిస్తున్నా సంబంధిత అధికారులు కనీస చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. దీంతో నిత్యం ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన కూడళ్ళ వద్ద ప్రజల అవస్థలు పడాల్సి వస్తుంది. సైడ్ డ్రైన్ల ఆక్రమణ కారణంగా చివరకు డ్రైన్లలో మురికి నీరు ప్రవాహానికి కూడా అవకాశం లేకుండా పోయింది. డ్రైన్ల లోపల ఎక్కడ చెత్త అక్కడ పేరుకుపోవడంతో రోడ్డు వెంట ప్రయాణించే ప్రజలు దుర్వాసనను సైతం భరించలేకపోతున్నారు. రోడ్లు, సైడ్ డ్రెయిన్లను ఆక్రమిస్తున్నా సంబంధిత యంత్రాంగం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజానీకం ప్రశ్నిస్తోంది. జిల్లా అధికారులు స్పందించి మండల కేంద్రంలోని ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రజల రాకపోకలకు అసౌకర్యం కలిగించకూడదు...
### ఎస్సై బాదావత్ రవి...

మండల కేంద్రమైన ప్రధాన రహదారి, చంద్రుగొండ వైపు, పాపకొల్లు వైపు, జూలూరుపాడు గ్రామంలోకి వెళ్లే మార్గాలు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటాయని అన్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న సైడ్ డ్రైన్ దాటి రోడ్లపై వరకు ఆక్రమించడం చట్టరీత్యా నేరమన్నారు. రోడ్లను ఆక్రమించడం వలన వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతుందని, రోడ్ల ఆక్రమణల వలన ప్రమాదాలు జరగడానికి కారణంగా మారుతాయని అన్నారు. రహదారుల నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా తక్షణమే ఆక్రమణలను తొలగించాలని, సైడ్ డ్రైన్లను దాటి ముందుకు రాకుండా ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని వారు కోరారు. లేనిపక్షంలో సంబంధిత శాఖల ఇంజనీర్లు, అధికారుల సమన్వయంతో సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

### రోడ్లపై ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలి...
### ఎంపీఓ తులసీరామ్ ...

జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రధాన రహదారితో పాటు పాపకొల్లు క్రాస్ రోడ్ , జూలూరుపాడు గ్రామంలోకి వెళ్లి రావిచెట్టు బజార్, చంద్రుగొండ క్రాస్ రోడ్డు కూడళ్ళలో రోడ్లను ఆక్రమించటం చట్టరీత్యా నేరమని మండల పంచాయతీల అధికారి తులసీరాం అన్నారు. మండల కేంద్రమైన ప్రధాన రహదారి, చంద్రుగొండ వైపు, పాపకొల్లు వైపు, జూలూరుపాడు గ్రామంలోకి వెళ్లే మార్గాలు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటాయని అన్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న సైడ్ డ్రైన్ దాటి రోడ్లపై వరకు ఆక్రమించడం చట్టరీత్యా నేరమన్నారు. రోడ్లను ఆక్రమించడం వలన వాహనాల రాకపోకలకు, పాదచారులకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతుందని, నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా తక్షణమే ఆక్రమణలను తొలగించాలని, సైడ్ డ్రైన్లను దాటి ముందుకు రాకుండా ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని వారు కోరారు. లేనిపక్షంలో సంబంధిత శాఖల ఇంజనీర్లు, అధికారుల సమన్వయంతో సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# వరి రైతుల వినూత్న ప్రయోగం

-తెగుళ్ల నివారణతో ఏపుగా వరి పైరు పెరుగుదల
-తగ్గనున్న సాగు ఖర్చు



**ప్రజాపక్షం/కరకగూడెం:** వ్యవసాయ సాగులో రోజు రోజుకు పెట్టుబడులు విపరీతంగాపెరిగిపోతున్నాయి. ఎకరానికి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు సాగు ఖర్చులు అవుతుంది. దిగు బడులు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో రైతులు నష్టాల పాలవుతున్నారు. దీంతో సాగు ఖర్చు తగ్గిం చుకునేందుకు రైతులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. వరి పైరును ఆశించే తెగుళ్ల నివా రణ కోసం రసాయన మందులు పిచికారి చేయ కుండా యూరియాలో డీజిల్ కలిపి వరి పైరుపై పిచి కారి చేస్తున్నారు. వరి పైరుపై డీజిల్ చల్లడం ఒక వింతగానే కనిపిస్తుంది. ట్రాక్టర్లు, లారీలు, బస్సులు, మోటార్లు ఇతర వాహనాలను నడపటానికి ఉపయో గించే డీజిల్ ను వరి పైరుకు వాడటం ఏమిటనేది విన డానికి కూడా వింతగానే ఉన్నప్పటికీ డీజిల్ వాడకం ముమ్మాటికీ నిజమే. గతంలో రైతులు కిరోసిన్ వరి పైరుకు వినియోగించే వారు క్రమంగా కిరోసిన్ కొరత రావడంతో డీజిల్ వాడుతున్నారు. వినూ త్నంగా ఈ ప్రయోగానికి రైతులు శ్రీకారం చుట్ట డంతో యావత్ తెలంగాణ వ్యాప్తంగా రైతులు పాటి స్తున్నారు.ఎకరానికి లీటర్ డీజిల్ వాడకండీజిల్ వరి పైరుకు వాడటం ఏమిటి అనేది ప్రశ్నాలుఉన్నప్పటికీ డీజిల్ వినియోగం వల్ల రైతులకు పెట్టు బడి భారం తగ్గుతుంది. రైతులకు సుమారు ఎకరా నికి రూ.1000 నుంచి రూ.1500 వరకు భారం తగ్గుతుందని పలువురు రైతులు తెలుపుతున్నారు. రైతులు యూరియాలో డీజిల్ ను కలిపి పిచికారి చేయడం వల్లన సాగు ఖర్చు తగ్గడంతో పాటు, సత్ఫ లితాలు కనిపిస్తున్నాయని అందుకే డీజిల్ వాడుతు న్నామని పలువురు రైతులు అభిప్రాయపడుతు న్నారు. మొదటిలో మెదక్, భద్రాది జిల్లాలో రైతులు ఈ విన్నూత ప్రయోగం చేశారు. వరికి వచ్చిన తెగులు, మొగిపురుగు, పచ్చపురుగు వంటి వాటి నుంచి ఈ ప్రయోగం వల్లన వరికి సోకకుండా ఉందని, సత్ఫలి తాలు డీజిల్ వినియోగం ఇస్తుండటంతో పురుగు మందులకు బదులుగా ఈ ప్రయోగానే రైతులు చేస్తు న్నట్లు తెలిపారు. అయితే డీజిల్ అధికంగా వాడినట్లయితే భూసారం దెబ్బతినే ప్రమాదం ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రైతుకు అద నపు ఖర్చులు తగ్గడమే కాకకుండా ఫలితాలు ఇస్తు న్నట్లు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కొద్ది మంది రైతులు మాత్రమే డీజిల్ వాడకానికి మొగ్గు చూపుతు న్నారని, వాటి ఫలితాలు మంచిగా రావడంతో రానున్న రోజుల్లో వరి సాగులో డీజిల్ వినయోగం పెరిగే అవకాశం కనిపిస్తుందని పలువురు రైతులు అభిప్రాయ పడుతున్నారు. అయితే రైతులు పంటకాలంలో రెండు దఫాలుగా వాడితే మంచి ఫలితాలు ఉంటాయని పేర్కొంటున్నారు.వరిపై మందులు చల్లుతున్న యువరైతు దుర్గం ప్రేమ్, కుమార్ వరిపై డీజిల్ యూరియా,20 20 ల తో కలిపి పిచికారి చేస్తున్నా నని తాటిగూడెం యువ రైతు దుర్గం ప్రేమ్కుమార్ తెలిపారు. డీజిల్ కలిపి వరిపై పిచికారి చేయడం వల్లన పంటపై పెట్టుబడి దిగుబడి తగ్గుతుందని ఎకరానికి సుమారు 1500 వరకు మిగులుతుందని అన్నారు. వరిలో వచ్చే దుబ్బుకుల్లుడు తగ్గించేం దుకు డీజిల్ పిచికారి చేయడం జరుగుతుం దని, యూరియాతో ఖరీఫ్ సీజన్లో డీజిల్ వినియో గించి రెండు దఫాలుగా వరిపై పిచికారి చేస్తున్నానని అన్నారు.

# జాతీయ స్థాయిలో ఐదవ ర్యాంకు సాధించిన సలీం



**ప్రజాపక్షం/ చింతకాని :** భారత ఓడరేవులు (పోర్టల్) ఉద్యోగ ఫలితాల్లో మండల పరిధిలోని నాగులవంచ రైల్వే కాలనీకి చెందిన షేక్ సలీం సత్తా చాటారు. బుధవారం వెలువడిన జాతీయ ఓడరేవులు (పోర్టల్) సివిల్ ఇంజనీరింగ్ ఫలితాల్లో సలీం 160 మార్కులకు గాను 146.25మార్కులు సాధించి జాతీయ స్థాయిలో సలీం ఐదవ ర్యాంకు సాధించాడు. దేశ వ్యాప్తంగా సివిల్ ఇంజనీరింగ్ అర్హత కలిగిన 14 పోస్టులు వెలువడగా వీటిలో తొమ్మిది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఐదు అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు ఉన్నాయి. 2025 డిసెంబర్ రెండున పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో సలీం జాతీయ స్థాయిలో ఐదవ ర్యాంకు సాధించాడు. సలీం ఒకటి నుంచి 10 వరకు ఖమ్మం కేంద్రీయ విద్యాలయంలో, ఇంటర్మీడియట్ న్యూవిజన్ కళాశాలలో చదివాడు. 2024లో ఎన్ఐటి వరంగల్ నుంచి సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో బిటెక్ పూర్తి చేశాడు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్‌లో ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ (ఐఈఎస్) సాధించడమే తన లక్ష్యమని తెలిపారు. సలీం తండ్రి నాగులమీరా ఖమ్మం మామిళ్లగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. జాతీయ స్థాయిలో తమ గ్రామానికి చెందిన యువకుడు సత్తా చాటడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం రూ.21 కోట్ల 20 లక్షలు మంజూరు

-తిరుమలాయపాలెం మండలానికి 808 ఇండ్లు మంజూరు
-ఇందిరమ్మ రాజ్యంలో పేదోడి ఇంటి కల సహకారం
-హౌసింగ్ ఏఈ కుదురుపాక మీతిన్ కుమార్







**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలంలో వేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం మండలంలో మొత్తం 808 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా నిర్మాణంలో ఉన్న 730 ఇండ్లకు ఇప్పటికీ తెలంగాణ ప్రభుత్వం 21 కోట్ల 20 లక్షల రూపాయల బిల్లులు చెల్లించిందని హౌసింగ్ ఏఈ కుదురుపాక మీతిన్ కుమార్ తెలిపారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా బేస్ మట్టం లెవెల్ 703 నుండి మొదలుకొని రెంటల్ లెవెల్ 590 ఇండ్లు స్లాబ్ లెవెల్ 470 ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. పూర్తయిన ఇండ్లు 30 మంది లబ్ధిదారులు గృహప్రవేశాలు జరిగాయని మొత్తం మండల వ్యాప్తంగా 79 మంది లబ్ధిదారులు ఇల్లు కట్టుకోలేమని తెలిపినట్లు ఆయన తెలిపారు. 79 లో 35 ఇండ్ల వివరాలను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక సమర్పించామని ఇంకా 44 ఇండ్ల లబ్ధిదారుల నివేదిక ఇవ్వాలని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచనల మేరకు నిర్మాణం చేపట్టని లబ్ధిదారుల స్థానంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆయన తెలిపినట్లు వివరించారు. ఉమ్మడి కుటుంబాలలో ఉంటూ నిర్మాణం చేపట్టిన లబ్ధిదారుల బిల్లులు చెల్లింపులు ఆగాయని త్వరలోనే అవి కూడా బిల్లులు మంజూరు అవుతాయని తెలిపారు. నిర్మాణంలో ఉన్న లబ్ధిదారులు త్వరితగతిన ఇండ్లు నిర్మాణం చేపట్టుకోవాలని ఆయన కోరారు. మండల వ్యాప్తంగా ఇండ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు హౌసింగ్ డిఈ శ్రీనివాస్, ఎంపీడీవో ఎస్ కే సిలార్ సహెబ్, ఏఈ మీతిన్ కుమార్, పరిశీలిస్తూ లబ్ధిదారులతో మాట్లాడుతూ సూచనలు సలహాలు చేస్తూ ఇండ్ల నిర్మాణం వేగంగా జరిగేందుకు కృషి చేస్తున్నారు.

# అంగన్‌వాడీలో అక్రమాలకు చెక్..!

**-కేంద్రాల పై సర్పంచ్ లకు పర్యవేక్షణ బాధ్యతలు**
**-చైర్మన్ తో పాటు 11 మంది సభ్యులతో ప్రత్యేక కమిటి**






**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. కేంద్రాలలో అమలు చేస్తున్న ఆరోగ్యలక్ష్మి, పథకం ను పకడ్బందీగా అమలు చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. వీటి ద్వారా చిన్నారులకు, గర్భిణీలకు బాలింతలకు పౌష్టికాహారం ను అందిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణీలలో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వారిని ప్రతీ నెలా పరీక్షించి తగిన చర్యలు తీసుకుంటున్నారు. తల్లులకు నిత్యం పాలు, ఉడకబెట్టిన గుడ్లు, మధ్యాహ్నం భోజనం అందజేస్తున్నారు. పిల్లల ఎదుగుదలను పరిక్షిస్తూ ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా ఆహారం ఇస్తున్నారు. రెండేళ్లగా సర్పంచ్ లు లేకపోవటంతో వీటి పంపిణీ లో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ సమస్య ను అధిగమించేందుకు ప్రభుత్వం కొత్త సర్పంచ్‌లతో అంగన్‌వాడీ స్థాయి పర్యవేక్షణ సహాయ కమిటీ ఏర్పాటు కు శ్రీకారం చుట్టారు. వీరి పర్యవేక్షణలో అక్రమాలకు చెక్ పడనున్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**కమిటి కూర్పు ఇలా....**

అంగన్‌వాడీ పర్యవేక్షణ కమిటీ లో సర్పంచ్ చైర్మన్ గా, అంగన్‌వాడీ టీచర్ కన్వీనర్ గా, సీడీపీవో, స్థానిక పాఠశాల ఉపాధ్యాయుడు, రిటైడ్ ఉద్యోగులు, ఏఎన్‌యంలు, చిన్నారుల తల్లుల కమిటి సభ్యులు గా ఉంటారు. మొత్తం 11 మందితో నూతనంగా కమిటి ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటి ప్రతీ నెలా సమావేశం ఏర్పాటు చేసి...చిన్నారులకు అందిస్తున్న ఆహారం పై చర్చించాలి. కేంద్రం కు అందుతున్న సరుకులు, నాణ్యత ను పరిశీలించాలి. పిల్లలు కేంద్రానికి వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. అక్రమాలకు వెంటనే ఉన్నాతాధికారులకు దృష్టికి తీసుకెళ్లాలి.

**జిల్లా లో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు...**

**-అంగన్‌వాడీ కేంద్రాలు..1840**
**-బాలింతలు...6,177**
**-గర్భిణీలు...6,215**
**-చిన్నారులు...30,016**
**-7 నుంచి 3 ఏళ్ల లోపు పిల్లలు-33,028.**

**కేంద్రాల పై పూర్తి బాధ్యతలు సర్పంచ్‌లకు ఇవ్వాలి.**
**కమదన ప్రవీణ్, తిరుమలాపురం.**



అంగన్‌వాడీ కేంద్రాల పై పూర్తి బాధ్యతలు సర్పంచ్‌లకు ఇవ్వాలి. అదే విధంగా ప్రభుత్వం కేంద్రాల బలోపేతం కు తగిన చర్యలు చేపట్టాలి. పౌష్టికాహారం ఇంకా మరింత పెంచాలి. గర్భిణీలు, బాలింతలకు, చిన్నారులకు మోనూ పెంచాల్సిన అవసరం ఉంది.

**కేంద్రాల పై సర్పంచ్‌ల పర్యవేక్షణ తో మరింత బాధ్యత..**
**ఆశోక్‌రాణి, సర్పంచ్, మంగాపురంతండా...**



అంగన్‌వాడీ కేంద్రాల ను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం సర్పంచ్‌ల కు బాధ్యతలు అప్పగించటం చాలా సంతోషంగా ఉంది. చిన్నారులు ఇంటి వద్ద ఉన్న ఫీలింగ్ వచ్చేలా ప్రభుత్వం కేంద్రాలను తీర్చిదిద్దుతుంది. చిన్నారులు తమ ఇంటి వద్ద నే ఉన్నామని ఫీలింగ్ వచ్చేలా కేంద్రాలను తయారు చేస్తుంది. చాలా సంతోషం గా ఉంది.

**కమిటీల ద్వారా సేవలు మరింత అందుతాయి...**
**యం.యర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి.**



అంగన్‌వాడీ కి కొత్తగా వేయనున్న కమిటీల ద్వారా ప్రతీ ఒక్కరికి సేవలు మరింత అందే అవకాశం ఉంది. కమిటీలు వేసిన తరువాత వారికి అవగాహన కల్పించే విధంగా ఐసీడీఎస్ అధికారులు తీసుకునే అవకాశం ఉంది. మొత్తం మీద అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం కు శ్రీకారం చుడుతుంది.

---

# యూరియా యాప్ ఓ మాయజాలం

**-మెరుపులా మాయమవుతున్న యూరియా**
**-బిత్తరపోతున్న రైతులు**
**-అక్రమార్కులకు యాప్ ఓ అవకాశం**



**ప్రజాపక్షం/కూసుమంచి:** యూరియా యాప్ రైతులకు ఓ మాయజాలంగా మారిందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. మండలంలోని జిల్లాలోనూ రైతులు యూరియా కోసం అనేక అవస్థలు పడుతూ రైతు నోట అంటున్న మాటలివి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకమని లేక యూరియా నీ ఒక క్రమ పద్ధతిలో ఉపయోగించాలని చెబుతున్నప్పటికీ ప్రభుత్వం పారదర్శకంగా యూరియాని అందించాలనే ఉద్దేశంతో యాప్ ఏర్పాటు చేశామని చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం మెరుపులా ఎగిరిపోయినట్లుగా రైతులు చెప్తున్నారు. ఇప్పటి వరకు యూరియా యాప్ ద్వారా ఒరిజినల్‌గా రైతులనే వారు ఎక్కడ ప్రయోజనం పొందినట్లు లేదని అనేక మంది రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితులు వినిపిస్తున్నాయి కనిపిస్తున్నాయి. ప్రభుత్వం రైతుకు ఎక్కడ సమస్యలు రాకుండా ఉండటానికి ఈ యాప్‌ని అందుబాటులోకి తెచ్చామని చెబుతున్నప్పటికీ అవేమీ లేదంటున్నారు. రైతులు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాలో నియోజకవర్గంలో యాప్‌లను ఉపయోగించి రైతులు తెచ్చుకుంటున్న యూరియా కట్టలు ఎక్కడ సత్ఫలితాలన్నీ ఇచ్చినట్లు కనిపించడం లేదు.




**మెరుపులా మాయమవుతున్న యూరియా....**

రైతులకు అందుబాటులో నియోజకవర్గాల్లోనూ లేక ఆయా సొసైటీ పరిధిలోను లేక ఆయా మండల పరిధిలోను ఇన్ని వందల యూరియా కట్టలు ఉన్నాయి. ఈ టైం నుండి ఈ టైం వరకు యాప్ ద్వారా బుక్ చేయించుకోమని అధికారులు తెలియజేస్తున్నప్పటికీ ఒకే సారిగా వేలకు వేలు యూరియా కట్టలు నిమిషాల్లోనే మాయమవుతున్నాయని(బుకింగ్ అయిపోయాయి) రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులకు ఈ యాప్‌లో బుక్ చేసుకోవడం రాకపోవడం, మరి కొందరికి నెట్ ప్రాబ్లం, ఇంకా కొందరికి దీని గురించి సక్రమమైన అవగాహన లేకపోవడం, మరికొందరు రైతులు నిరక్షరాస్యులు కావడం, కొందరికి హ్యాండ్ రైడ్ ఫోన్ లేకపోవడం, ఒకరు బుక్ చేసుకుని మరొకరికి బుక్ చేయడానికి ప్రయత్నం చేసే క్రమంలోనే మెరుపు వేగంతో వేళల్లో వందలలో చూపించిన యూరియా కట్టలు నిమిషాల్లోనే మాయమవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

**అనేక మంది రైతులకు రేపటి యాప్‌లో...**

గ్రామీణ ప్రాంతాల్లో ఏ రైతు నోట విన్న బుక్ అయిపోయాయి. రేపటి యాప్‌లో బుక్ చేసుకోమని రైతులకు అధికారులు సూచిస్తున్నారంటూ రోజుల తరబడి ఇవే మాటలు చెబుతున్నారని రైతులు చర్చించుకుంటున్న విషయం అది రేపు ఏ రకంగా మారుతుందో అనేది కూడా ఒక ప్రశ్నార్థకంగా ఉంది. ఇలా వచ్చిన యూరియా కట్టలు అలా బుక్ అయిపోతున్నాయి అంటూ వారతా తరబడి లోడ్స్ వస్తున్నాయి పోతున్నాయి అంటున్నారు కానీ మా చేతికి యూరియా కట్టలు అందటం లేదని రైతులు చెప్పుకుంటూ ఈ యాప్ ద్వారా మాకు ఒరిగేది ఏమీ లేదని తెలియజేస్తున్నారు.

**అక్రమార్కులకు యాప్ ఓ అవకాశం....**

ప్రభుత్వం రైతులకు అందబాటులో యూరియా ఉండాలని యాప్‌ను ప్రారంభిస్తే ఈ యాప్ ద్వారా ఏ రైతుకు అందుతుందో ఏ రైతుకు అందటం లేదో ఎక్కడా స్పష్టత లేకుండా ఉండటమే కాక నియోజకవర్గ స్థాయిలో రైతు ఎక్కడికైనా వెళ్లి యూరియా కట్టలు తెచ్చుకోవచ్చు అనే పద్ధతి ఏర్పాటు చేయడం వల్ల ఎక్కువ శాతం నిరక్షరాస్యులుగా ఉన్న రైతులకు అన్యాయమే జరుగుతుందని నిర్భయంగా చెప్పవచ్చు. ఈ యాప్ ద్వారా కొందరు అక్రమార్కులు వేలాది యూరియా కట్టలను బ్లాక్ మార్కెట్‌గా మారుస్తూ ఇంకా జిల్లా సరిహద్దులు దాటివేస్తూ అక్రమ వ్యాపారానికి వడిగడుతున్నారని విమర్శలు వస్తున్నందున ఇప్పటికైనా ప్రభుత్వం ఆన్లైన్‌లో రైతులకు అందిని అందించినట్లయితే రైతులకు ఇప్పటికైనా న్యాయం జరుగుతుందని రైతులు చెబుతున్నారు.

---

# శివ కళ్యాణానికి వేళాయె..!

**-శివసన్నిధిల్లో కొనసాగనున్న ప్రత్యేక పూజలు**
**-భక్తులకు చలువ పందిళ్లు...ప్రత్యేక క్యూలైన్లు**
**-గోదావరి నది తీరాన స్నాన ఘట్టాలు**
**-ఉపవాస దీక్షలతో జాగారణకు ఆచరించనున్న భక్తులు**







**ప్రజాపక్షం/పినపాక:** మండల వ్యాప్తంగా ఈనెల 15వ తేదీ మహాశివరాత్రిని పురస్కరించుకొని జరగబోయే శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి చింతల బయ్యారం, సీతంపేట, దుగినేపల్లి, గొట్టెల్ల శివాలయాలు ముస్తాబవుతున్నాయి. ముఖ్యంగా పాతరెడ్డిపాలెం గ్రామ పంచాయితీ పరిధిలోని చింతలబయ్యారం గ్రామ సమీపంలోని గోదావరి నది తీరాన స్వయంభుగా వెలిసినటువంటి కాకతీయుల కాలంనాటి చారిత్రకమైన చరిత్ర కలిగిన పురాతనమైన శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయం సర్వసుందరంగా ముస్తాబైంది. సాంప్రదాయ బద్ధంగా మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. తెల్లవారుజామున 4గంటల నుండి భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరిస్తారు. 6గంటల నుండి అభిషేకాలు పూజలు నిర్వహించనున్నారు. స్వామి వారి కళ్యాణం రాత్రి 2:30 గంటల నిమిషాలకు జరుగుతుంది. అనంతరం ఈ శివపార్వతుల కళ్యాణ మహోత్సవ వేడుకలకు వివిధ ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి వారిని ఆదర్శించుకుంటారు. భక్తులు అదిక సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో ఆలయ కమిటీ వారు శివాలయ ప్రాంగణం చుట్టూ విద్యుత్ దీపాలంకరణ భారీ ఎత్తున చేస్తున్నారు. దేవాత మూర్తుల విద్యుత్ కటౌట్లు ఏర్పాటు చేస్తున్నారు. కళ్యాణ మహోత్సవంలో భాగంగా చివరి రోజు నిర్వహించే కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారి ఊరేగింపునకు రథోత్సవానికి సుందరంగా పల్లకిని మెరుగులు దిద్దుతున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ పరిసరాలను పరిశుభ్ర పరుస్తూ, సర్వసుందరంగా తీర్చిదిద్దుతున్నారు. భక్తుల కోసం చలువ పందిళ్లు, ప్రత్యేక కూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా గోదావరి నది తీరాన లోతు ప్రదేశం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గోదావరి దగ్గర స్నానమాచరించే వారికి ముఖ్యంగా మహిళలకు ఎలాంటి అసౌకర్యాలకు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక స్నాన ఘట్టాలను ఏర్పాటు చేస్తున్నారు. ఉపవాస దీక్షలతో భక్తులు శివపార్వతుల సన్నిధిలో జాగారణ చేస్తుంటారు. ఇదిలా ఉండగా ట్రాఫిక్‌ను క్రమ బద్ధీకరణకు పోలీసులు, పంచాయితీ అధికారులతో సమన్వయంగా చర్యలు చేపట్టి వాహనాల పార్కింగ్ ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు. శివపార్వతుల దర్శనానికి వచ్చే భక్తులు భక్తి శ్రద్ధలతో ఆలయ కమిటీ నియమ నిబంధనలు పాటిస్తూ పూజా కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జాతరకు వచ్చే పిల్లలు, పెద్దలను అలరించడానికి భజన, కోలాట సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ పరిసరాల్లో పెద్ద ఎత్తున మంచి నీరు సదుపాయం, మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అంతే కాకుండా వైద్య ఆరోగ్య శాఖ అత్యవసర చికిత్స నిమిత్తం ప్రత్యేక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. చింతల బయ్యారం ఆలయ కమిటీ, అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపడుతున్నారు.